నమస్తే తెలంగాణ

జోగులాంబ గద్వాల వనపర్తి

5 | మహబూబ్‌నగర్, సోమవారం 22 జనవరి 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY

జలవిద్యుత్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

మాది ప్రజా ప్రభుత్వం

- వైద్య, ఆరోగ్య శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ
- శ్రీశైలఆ లయం,జ లవిద్యుత్‌కేం ద్రంసం దర్శన

అచ్చంపేట, జనవరి 21 : మాది ప్రజా ప్రభుత్వమని, రాష్ట్ర ప్రజల అవసరాలు, ఆకాంక్షలకనుగుణంగా పనిచేస్తున్నామని వైద్య, ఆరోగ్య శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. ఆదివారం శ్రీశైలంలోని భ్రమరాంబిక, మల్లికార్జున స్వామిని మంత్రి దర్శించుకున్నారు. అనంతరం తిరుగు ప్రయాణంలో ఈగలపెంట వద్ద ఉన్న శ్రీశైలం ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి సందర్శించారు. గతంలో జెన్‌కోలో జరిగిన ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. విద్యుదుత్పత్తి నిర్వహణను జెన్‌కో చీఫ్ ఇంజినీర్ సూర్యనారాయణ, ఎస్‌ఈలు ఆదినారాయణ, రవీంద్రకుమార్ వివరించారు. అనంతరం ప్రధాన కంట్రోల్‌రూమ్, చివరి ఫ్లోర్‌కు వెళ్లి క్షేత్రస్థాయిలో విద్యుత్ ఉత్ప త్తి పనితీరును తెలుసుకున్నారు. అంతకుముందు దోమలపెంట జీపీలో రాములమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత సేవ అంబులెన్స్ సౌకర్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్లు, టాయిలెట్స్ నిర్మాణాలను ప్రారంభించారు. సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్న ట్రస్ట్ నిర్వాహకుడు వెంకటేశ్‌ను అభినందించారు. దోమలపెంటలో రూ.20 లక్షలతో పల్లె దవాఖాన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయన వెంట నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో పూజలు..

శ్రీశైలం, జనవరి 21 : శ్రీశైల భ్రమరాంబమల్లికార్జున స్వామి, అమ్మవార్లను మంత్రి దామోదర రాజనర్సింహ దంపతులు దర్శించుకొన్నారు. ఆలయ ప్రధాన గోపురం వద్దకు చేరుకున్న వీరికి ఈవో పెద్దిరాజు ఆధ్వర్యంలో తిలకధారణ చేసి పూలమాలతో స్వాగతం పలికారు. అర్చకులు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. శేషవస్త్రంతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు.

మృతుడి భార్యకు బీమాచెక్కు నుఅం దజేస్తున్న మాజీమ ంత్రిని రంజన్‌రెడ్డి

కార్యకర్తలకు అండగా ఉంటాం

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు అందజేత

వనపర్తి, జనవరి 21 : వనపర్తి నియోజకవర్గంలోని ప్రతి కార్యకర్తకు ఆపదలో అండగా నిలుస్తామని, ఎవరూ అధైర్యపడొద్దని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ధైర్యం చెప్పారు. కడుకుంట్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త చిలుక సాయికృష్ణ మృతి చెందడంతో పార్టీ నుంచి మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును ఆదివారం జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి నివాసంలో మృతుడి భార్య గీతకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుందని, అధైర్యపడొద్దని, మీకు ఏ ఆపద వచ్చినా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మున్ముందు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను బీఆర్ఎస్ తరపున ఎండగట్టాలన్నారు. స్థానిక, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ పార్టీకి అండగా నిలుస్తారని, అందుకు పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రజల మధ్యలో ఉండాలన్నారు. అనంతరం మాజీ సర్పంచ్ రాజశేఖర్‌గౌడ్ కుమారుడు రేవంత్‌గౌడ్ రోడ్డు ప్రమాదంలో చేయి విరిగి చికిత్స పొందుతున్న విషయం తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. పట్టణంలోని స్టాంప్ వెండర్ మొల్గర బాలచంద్రుడు అ నారోగ్యంతో మృతిచెందగా.. ఆయన పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి వెంట మున్సిపల్ చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, మీడియా కన్వీనర్ అశోక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మాణిక్యం, కౌన్సిలర్లు కృష్ణ, శేఖర్, రవి, నాయకులు వెంకటేశ్, తిరుమల్, రవికుమార్, చంద్రశేఖర్‌యాదవ్, మాధవరెడ్డి, జాత్రునాయక్, వేణుగోపాల్, శివన్నసాగర్, వెంకటసాగర్, జోహెబ్ ఉన్నారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గువ్వల బాలరాజు

అహంకారపు మాటలొద్దు

- బీఆర్ఎస్‌ను భూస్థాపితం చేయడం ఎవరితరం కాదు
- ముందు కాంగ్రెస్ హామీలు అమలు చేయండి
- వ్యవసాయానికి మొదలైన సాగునీరు, కరెంట్ కష్టాలు
- గులాబీ పార్టీ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గువ్వల

వంగూరు, జనవరి 21 : ముఖ్యమంత్రి హోదాలో ఉన్న రేవంత్‌రెడ్డి అహంకారపు మాటలు మాట్లాడడం సరికాదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు హితవు పలికారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ నాడు సీఎంగా ఉన్న వైఎస్ఆర్ సైతం ఇలాంటి వ్యాఖ్యలే చేశారని గుర్తు చేశారు. బీఆర్ఎస్‌ను భూస్థాపితం చేయడం ఎవరితరం కాదన్నారు. ఆదివారం వంగూరులో బీఆర్ఎస్ నేతలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉవ్వెత్తున గులాబీ పార్టీ ఎగిసిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల తిరుగుబాటుతో మరోసారి బీఆర్ఎస్ పుంజుకోవడం ఎంతో దూరంలో లేదన్నారు. ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసి తర్వాత బీఆర్ఎస్‌పై విమర్శలు చేయాలని సూచించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర మంత్రులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. యాసంగి సాగుకు ఇప్పటివరకు రైతుబంధు సాయం అందలేదని, ఇక రైతు బీమాకు దిక్కే లేదన్నారు. ఆడపడుచుల పెండ్లిళ్లకు కల్యాణలక్ష్మి ద్వారా రూ.లక్షా116తోపాటు తులం బంగారం ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని నిలదీశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే సాగుకు కరెంట్ కష్టాలు మొదలయ్యాయని, ఇక సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం కేఆర్ఎంబీ ప్రతిపాదిస్తే దానికి తలూపిన రేవంత్ ప్రభుత్వం, ప్రజలకు ఏం సమాధానం చెబుతుందని ప్రశ్నించారు. ఈ ప్రతిపాదనతో ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టుల నిర్మాణం నిలిచిపోయే ప్రమాదం ఉన్నదని ధ్వజమెత్తారు. గతేడాది డిసెంబర్ 9న రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి ఒక్క రూపాయి కూడా మాఫీ చేసిన పాపాన పోలేదన్నారు. సమావేశంలో నాయకులు గణేశ్‌రావు, రాజేందర్ రెడ్డి, ఆనంద్‌రెడ్డి, ఎల్లాగౌడ్, దేవ, జంగయ్య, నాగేశ్, కృష్ణ, తిరుపతయ్య, వెంకటస్వామి పాల్గొన్నారు.

నిరంజన్ షావలీ దర్గాలో ప్రార్థనలు..

అచ్చంపేటరూరల్, జనవరి 21 : మండలంలోని రంగాపూర్ నిరంజన్ షావలీ దర్గాను ఆదివారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు దర్శించుకొన్నారు. ముందుగా దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం జాతరలో కలియతిరిగి వ్యాపారులు, భక్తులను పలుకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పదర జెడ్పీటీసీ రాంబాబునాయక్, ఎంపీపీ శాంతాబాయి, రంగాపూర్ సర్పంచ్ లోక్యానాయక్, బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు అమీనొద్దీన్, ఖలీల్, ఖాజా, జమాల్ తదితరులు ఉన్నారు.

కల్వకుర్తి పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన శేఖరాచారి సుమారు 9 గ్రాముల పంచలోహాలతో సూక్ష్మ రామ మందిరం, కలశం, రాములవారి విల్లు, శ్రీరాముడి పాదుకలను తీర్చిదిద్దాడు. వీటిని అయోధ్యకు పంపించనున్నట్లు శేఖరాచారి తెలిపాడు. అలాగే ఆయన కుమారుడు యశ్వంత్‌కుమార్ రామమందిరం నమూనాను, చాక్‌పీస్‌పై రాములోరిని చిత్రించాడు.

– కల్వకుర్తి రూరల్, జనవరి 21

అపూర్వ స్వర్ణోత్సవం

జడ్చర్ల, జనవరి 21 : బాదేపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో 1972–73లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం కుర్వగడ్డపల్లి వద్ద సమావేశమయ్యారు. దాదాపు 50 ఏండ్ల తర్వాత కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అదే విధంగా నాటి ఉపాధ్యాయులను ఆహ్వానించి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బాదేపల్లి మాజీ సర్పంచ్ సీతారాం, మురళి, శివకుమార్, ఖాదర్‌పాషా, డాక్టర్ ఫిరోజ్‌అలీ, శ్రీనివాసులు, శశికుమార్, నరేందర్, సుధాకర్, విజయలక్ష్మి, అరుణ, శారద, సుశీల, విజయలక్ష్మి, నాటి ఉపాధ్యాయులు పాండురంగారావు, విశ్వనాథం, వెంకటకృష్ణయ్య, రాములు తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

చిన్మయస్వామి మఠాన్ని అభివృద్ధి చేస్తా..

- మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

నవాబ్‌పేట, జనవరి 21 : మండలంలోని కొల్లూరు శివారులో ఉన్న చింతలపురి చిన్మయస్వామి మఠం అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. చిన్మయస్వామి మఠం రజతోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన మహారుద్రయాగంలో పాల్గొని పూజలు చేశారు. అనంతరం మఠం అభివృద్ధికి రూ.1.16 లక్షల విరాళాన్ని ఎంపీ అందజేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన 450 జంటలతో మహారుద్రయాగం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, విండో చైర్మన్ నర్సింహులు ఉన్నారు.